

# మ్యూజికల్ మ్యూజింగ్స్

- కస్తూరి మురళీకృష్ణ

**ఆప్ కే హసీన్ రుఖ్ పె ఆజ్ నయా నూర్ హై**

**మేర దిల్ మచల్గయా తొ మేర క్యా కసూర్ హై!**

**మన సినిమాలు** అధిక శాతం ప్రేమ ప్రధాన సినిమాలు. ప్రేమను వ్యక్త పరచేందుకు పాట ప్రధాన సాధనం, ముఖ్యంగా నాయికను వర్ణించే పాటలు, నాయక వర్ణన పాటలు, అందుకే సినీ గీతాలలో అత్యంత కీలకమైన స్థానాన్ని ఆక్రమిస్తాయి. ఒక గేయ రచయిత సంస్కారం, శృంగార రసాన్ని అత్యంత సుందరంగా వ్యక్తపరచే ప్రతిభ, సున్నితత్వం వంటి అనేక అంశాలు ప్రేయసి వర్ణన గేయాలలో ద్యోతకమవుతాయి. కేవలం గేయ రచయిత వ్యక్తిత్వము మాత్రమే కాదు, సంగీత దర్శకుడి మనస్సు, నాయికా నాయకులు, నిర్మాత, దర్శకుల మనస్సులలో ఉన్న ప్రేమ భావన స్వరూపం ఆయా పాటల చిత్రీకరణలో స్పష్టమౌతుంది. అయితే సినిమాలో గేయం దృశ్యరూపం ధరించేందుకు, నటీనటులకు నటించేందుకు ప్రేరణ, చిత్రించేందుకు దర్శకుడికి ప్రేరణ ఇచ్చేది గేయ కవిత . కొందరు సంగీత దర్శకులు గేయ రచయిత గేయం రాసిన తరువాత బాణీ కడతారు. మరికొందరు బాణీ ఇచ్చి గేయం రాయమంటారు. ఓ.పి నయ్యర్ కొన్నిమార్లు బాణీ ముందు ఇస్తాడు. మరికొన్ని మార్లు గేయ రచయిత రాసిన తరువాత బాణీ కడతాడు.

'బహారే ఫిర్ భీ ఆయేగీ' సినిమాలో గేయ రచయిత అంజాన్ రచించగా, ఓ.పి నయ్యర్ స్వరపరచినదీ పాట. ఈ పాట రాసే సమయానికి 'అంజాన్'కు గేయ రచయితగా ఓ మోస్తరు గుర్తింపు ఉంది. సి గ్రేడు సినిమా పాటల రచయితగా భావించేవారు. 'గోదాన్' సినిమాలో రవిశంకర్ సంగీత దర్శకత్వంలో హిట్ పాటలు రాసిన తరువాత కాస్త పెద్ద నిర్మాణ సంస్థలు అంజాన్‌ను గేయ రచయితగా పరిగణించటం ఆరంభించాయి. అలాంటి సందర్భంలో అతడికి లభించింది ఈ పాట. సినిమాలో ఈ దృశ్యం అత్యంత కీలకమైనది. నిజానికి 'బహారే ఫి భి ఆయేగీ ' సినిమాను ఆరంభించింది గుర్‌దత్. కానీ సినిమా కొద్దిగా తయారయిన తరువాత ఆయన హఠాత్తుగా మరణించాడు. దాంతో సినిమా ఆగిపోయింది. గురుదత్ పాత్రను ధర్మేంద్ర పోషించాడు. గురుదత్ మరణించే ముందు 'ఆప్ కీ హసీన్ రుఖ్ ' పాట చిత్రీకరణను పూర్తి చేశాడు. దాంతో మళ్లీ ఈ పాటను షూట్ చేసేకన్నా ముందు ధర్మేంద్ర గురుదత్ షూట్ చేసిన పాటను చూశాడు. గురుదత్ పాటను ఎంత తీవ్రమైన రొమాంటిక్ భావనతో, సాంద్రమైన రొమాంటిక్ పాటగా చిత్రీకరించాడో చూశాడు. కానీ ఎంత ప్రయత్నించినా గురుదత్ తెరపై పాత్రకు ఆపాదించిన తీవ్రమైన ప్రేమ భావనను ధర్మేంద్ర ప్రదర్శించలేకపోయాడు. దాంతో, గురుదత్ చిత్రీకరణ విధానాన్ని ఎంతగా అనుసరించినా పాట ప్రభావం వింటే ఉన్నంతగా చూస్తుంటే ఉండదు.

ప్రేమలో ఉన్నవారికి ప్రపంచమంతా ప్రేయసి కనిపిస్తుంది. ప్రేయసి అణువణువునా ప్రకృతి పరవళ్లు తొక్కుతూ దర్శనమిచ్చి ఆనందింపచేస్తుంది. ఉన్నతము, ఉత్తమమూ, సంస్కారవంతమయిన సున్నిత భావనలతో నాయకుడు నాయికను దాదాపుగా ఓ దేవతలా భావించి కొలిచేవాడు. నాయిక సైతం ఆ గౌరవాన్ని నిలబెట్టుకునే రీతిలో హుందాగా ప్రవర్తించేది.

ఈ గేయం ఆరంభంలోనే అంజాన్ చమత్కారం చేశాడు. ప్రేయసి వదనంపై సరికొత్త వెలుతురు ఉందట. అంటే ఆమె వదనం ఆరోజు రోజూ కన్నా అందంగా ఉందని, వింత అందంతో మెరుస్తోందని అర్థం చేసుకోవచ్చు. మామూలుగానే ప్రియుడికి ప్రేయసిని మించి ప్రపంచంలో అందంలేదు. ఆమె పేరు తలిస్తేనే ప్రేమ తుఫాను తాకిడికి ఉక్కిరిక్కిరి అవుతాడు. అలాంటిది ఆమెను దర్శిస్తే, ఆమె దర్శనంతోటే సర్వం మరచిపోతాడు. ఆపై ఆమె వదనం వింత అందంతో మెరుస్తూంటే ఇక అతని హృదయం చలించిపోవటంలో ఆశ్చర్యం ఉండదు. అందులో అతడి తప్పుకూడా ఉండదు. అందుకే 'ఈ రోజు నీ వదనం వింత అందంతో మెరుస్తోంది, నా హృదయం చలించటంలో నా దోషం ఏముంది?' అని ప్రశ్నిస్తున్నాడు మొదట్లోనే. అంటే, తరువాత గేయంలో నాయిక వర్ణనలో నాయకుడు ఎన్ని అతిశయోక్తులు వాడినా, ఎన్ని గొప్ప ఉపమానాలు వాడినా, అవి ఎంతగా పొగుడుతున్నట్టు ఉన్నా దానికి దోషం నాయకుడిది కాదు. దోషం ఆమె అందానిది! ఈ విషయాన్ని ఆరంభంలోనే నిశ్చయంగా ప్రదర్శించాడు గేయ రచయిత. ఇదొక చమత్కారమైన గేయ రచన పద్ధతి. ఇక ఇక్కడి నుంచి గేయమంతా, నాయకుడు నాయిక రూపాన్ని, దాని ప్రభావాన్ని వర్ణిస్తాడు. అంతా వర్ణించి, నేనింతగా నియంత్రణ కోల్పోవటానికి దోషం నాది కాదు, ఈ రోజు ప్రత్యేకంగా కనిపిస్తున్న నీ అందానికి అంటాడు.

**ఆప్ కే నిగాహ నే కహతో కుఛ్ జరూర్‌హై**

**మేర దిల్ మచల్ గయాతో మేర క్యా కసూర్ హై.**

ఆమె అందంగా ఉండటం ఒక్కటే కాదు, ఆమె కళ్లు అతడితో ఏదో చెప్పాయి. ఇక హృదయం చలించకుండా ఉంటుందా? చలించక పోతే దోషం అతనిది కానీ, హృదయం కల్లోల సంద్రమయితే దోషం అతనిదెలా అవుతుంది? అతనితో ఏదో అన్న ఆమె కళ్లది అవుతుంది.

**ఖులీ లటోంకి ఛావొమె ఖిలాఖిలా యె రూప్ హై**

**ఘటాసె జైస్ ఛన్ రహీ, సుబహ్, సుబహ్ కి ధూప్ హై**

అత్యద్భుతమైన వర్ణన. అత్యుత్తమమైన భావన. అత్యంత సంస్కారవంతమైన ఆలోచన. ఆమె కురులు దట్టంగా ఉన్నాయి. అక్కడక్కడా కురుల నడుమ నుండి వాటి నీడలో ఒదిగిన విరిసిన ఆమె రూపం కనిపిస్తోంది. మనం ప్రయాణిస్తున్నప్పుడు చెట్ల ఆకుల సందుల నుండి సూర్యకిరణాలు మెరుపులా దర్శనిమిచ్చి మురిపిస్తుంటాయి. సూర్యకిరణాల గుంపు ఒక ధారలా కనిపిస్తూ అత్యద్భుతమైన భావాన్ని, కలిగిస్తాయి. కిటికీల సందులలోంచి, జాలువారే సూర్యకిరణాల సమూహం ఓ పాలపుంతలా తోస్తుంది. అలా, ఆమె రూపం కురుల మాటునుండి అతడికి కనిపించింది. ఈ విషయంలో ఎలాంటి సందేహం లేకుండా, తరువాత పాదంలో పోలికను స్పష్టం చేస్తాడు. మేఘాల మాటునుండి సూర్యుడి వెలుతురు సహస్ర బాహువులతో ఎలా విస్తరిస్తూందో, అలా మేఘంలాంటి కురుల మాటునుండి ఆమె విరిసిన వదనం కనువిందు చేస్తోందన్న మాట. ఎంత అద్భుతమైన భావం!

మేఘాల మాటునుండి కొద్ది కొద్దిగా కనిపించే సూర్యుడి వెలుతురు తీవ్రత అధికం. కళ్లు మిరుమిట్లు గొలిపే వెలుతురు. కురుల మాటునుండి కనిపించే ఆమె వదనం, మేఘాల మాటునుండి ప్రసరించే ఉదయపు వెలుతురులా ఉందన్నమాట.

**జిధర్ నజర్ ముడీ, ఉధర్ సురూర్ హీ సురూర్ హై**

ఇక ఇలా వెలుతురు ప్రసరిస్తున్న తరువాత ఎటు చూస్తే అటు ఆనందం చిందులు వేయకుండా ఉంటుందా? అంతటి అందాన్ని, ఆనందాన్ని అనుభవిస్తున్న సున్నిత హృదయం స్పందించకుండా ఉంటుందా? అలా స్పందించటంలో హృదయం దోషం ఏమైనా ఉంటుందా?

ఇక్కడ గమనించవలసిందేమిటంటే  గేయం స్థాయి. మామూలుగా చంద్రవదన, ఇందువదన అని పొగిడి రాసేయవచ్చు కవితను. కానీ గేయ రచయిత వర్ణనలో చమత్కారం, ఉత్తమ సంస్కారం, సున్నితమైన భావం ప్రదర్శిస్తూ నాయికను ప్రకృతితో పోల్చటం వల్ల నాయిక గౌరవాన్ని ఇనుమడింప చేస్తున్నాడు. తన ప్రేమ తీవ్రతను సున్నితంగా ప్రకటిస్తున్నాడు.

**ఝుకీ ఝుకీ నిగాహమే భి హై బలాకి షోకియాన్**

**దబీ దబీ హసీ మె భి తడప్ రహీహై బిజ్లియా**

**షబాబ్ ఆప్‌కా నషే మె ఖుద్ హి చూర్ చూర్ హై**

సిగ్గుతో దించుకున్న ఆమె కళ్లలో చిలిపితనం తెలుస్తోంది. ఆపుకుంటున్న ఆమె నవ్వులో మెరుపులు అణిగి అల్లల్లాడుతున్నాయి. మెరవాలని తపన పడుతున్నాయి. కానీ ఆమె ఆ మెరుపులను అదిమి పడుతోంది. అత్యద్భుతమైన దృశ్యం అది. ఎలాంటి వాడయినా ఆ వాలుకన్నులలోని చిలిపితనానికి, అదిమి పట్టిన మెరుపుల తపనకు లోబడి మైమరచిపోవాల్సిందే. అందుకే ఆమె యవ్వనం ఇక్కడ అందంగా భావించవచ్చు, ఆమె అందం మత్తులో మునిగి కరిగి పోయిందట. అలాంటప్పుడు అతడి హృదయం స్పందిస్తే అతడి దోషం ఏముంటుంది?

**జహాఁ జహాఁ పడే కదం, వహా ఫిజా బదల్ గయీ**

**కె జైసె సర్ బసర్ బహార్ ఆప్ హీ మె ఢల్ గయీ**

**కిసీమె యే కషిష్ కహా, జో ఆప్ మె హుజూర్ హై**

కళ్లల్లో చిలిపితనం, పెదవులలో ఒదిగిన మెరుపులు, కురుల నీడలలో విరిసిన వదనం, మేఘాల నుండి ప్రసరించే కాంతి. ఇలా ఎంతగా వర్ణించినా తనివి తీరలేదు నాయకుడికి. ఆమె ఎక్కడెక్కడ అడుగు పెడితే అక్కడ వాతావరణం మారిపోయింది. ఋతువు మారిపోయింది. ఎందుకంటే వసంతం మొత్తం ఆమెలో ఒదిగిపోయింది. ఇలాంటి ఆకర్షణ, ఇంత అందం ఆమెలో ఉన్నంత ఇంకెవరిలో ఉండదు. అలాంటప్పుడు నాయకుడి హృదయం చలిస్తే అది అతని దోషం ఎలా అవుతుంది?

ఇదీ అంజాన్ రచించిన గేయం. అత్యద్భుతం. నాయికను వర్ణిస్తూ పలు అత్యద్భుతమైన గీతాలు ఉన్నాయి. కానీ, ఈ పాటలో ఉన్న సాంద్రత, ఒక రకమైన తీవ్రత ఈ పాటను ఇతర గీతాలకన్నా ప్రత్యేకంగా నిలుపుతుంది . ముఖ్యంగా, ఓ.పి. నయ్యర్ సాధారణంగా రూపొందించే బాణీలకు పూర్తిగా భిన్నమైన బాణీ కావటం కూడా ఈ పాటకు అదనపు ఆకర్షణ. ఓ.పి.నయ్యర్ పాటలలో ఉండే 'లయ' కు భిన్నమైన లయ ఈ పాటలో కనిపిస్తుంది. హఠాత్తుగా వింటే శంకర్ జైకిషన్ బాణీ ఏమో అనిపిస్తుంది. ముఖ్యంగా, పియానో, వయొలిన్లతో సృజించిన ఒక సింఫొనీ తరహా వాయిద్య సంవిధానం ఈ పాట స్థాయిని మరింతగా పెంచుతుంది. అడుగడుగునా పియానో గాయకుడితో జుగల్బందీ చేస్తున్న భావన కలిగిస్తుంది. శంకర్ జైకిషన్‌ల పోటీని తట్టుకుని దీటుగా నిలిచేందుకు ఆకాలంలో ప్రతి సంగీత దర్శకుడు ప్రయత్నించాడు. మ్యూజిక్ అరేంజర్ 'సెబాస్టియన్' ప్రధానంగా శంకర్ జై కిషన్‌ల అసిస్టెంట్ అయినా ఇతర సంగీత దర్శకులకు, ముఖ్యంగా సలీల్ చౌధరీ, ఓ.పి.నయ్యర్‌లకు కూడా 'అరేంజర్'లా పని చేశాడు. కానీ ఆయన ఏ సంగీత దర్శకుడితో పనిచేస్తే ఆ సంగీత దర్శకుడి వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించాడు తప్ప, శంకర్ జైకిషన్ తరహాను కానీ, స్వీయ వ్యక్తిత్వాన్ని కానీ కనబడనివ్వలేదు. ఇది సెబాస్టియన్ ప్రత్యేకత. కానీ ఈ పాటలో ఓ.పి శైలికి భిన్నమైన ఆర్కెస్ట్రేషన్ కనిపిస్తుంది. దీనితో పాటు 'హం సాయ' సినిమాలో 'దిల్‌కి ఆవాజ్ భి సున్' పాటలోనూ పియానో లయ సెబాస్టియన్ ప్రత్యేకత అనిపిస్తుంది. ఈ రెండు పాటలు ఓ.పి నయ్యర్ మామూలు పాటలకన్నా పూర్తిగా భిన్నమైనవి. 'పీలూ' రాగాన్ని అధికంగా వాడే ఓ.పి.నయ్యర్ ఈ పాటకు సుందరము, సరళము, మృదుమధురమయిన'యమన్' రాగాన్ని వాడటం కూడా పాటను ఓ.పి.నయ్యర్ ఇతర బాణీలకు భిన్నంగా అనిపించేట్టు చేసిన అంశం.

ఈ పాటను రఫీ పాడిన విధానం గురించి ఎంత చెప్పినా తక్కువే. ప్రతి ఒక్క పదాన్ని అక్షరాన్ని అర్ధవంతంగా పలకటమే కాదు, తాను అనుభవిస్తూ, ఇతరుల అనుభవానికి కూడా వచ్చేట్టు పాడటం ఒక్క మహమ్మద్ రఫీకే సాధ్యం. అది పాటలో మరింత ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. 'ఆప్ కీ' అంటూ ఆరంభించటంలో 'ఆ' దగ్గర గమకం, 'దిల్' దగ్గర చిలిపితనం, మళ్లీ ఆప్ కే అంటూ ఆరంభించటంలోని మత్తు, 'మేర' అనటంలోని విరుపు, మేర అంటూ ఎగిరి, 'దిల్' అంటూ లోయలో దింపటం ఆపై మత్తు, చిలిపితనం, చమత్కారాలను చూపిస్తూనే తన

భావనలోని నిజాయితీని అడుగడుగునా చూపించటం. ఇలా ఒకే సమయంలో పలు విభిన్నమైన స్పందనలను కలిగిస్తూ భావాలను పలకగల ఏకైక గాయకుడు రఫీ విశ్వరూప ప్రదర్శన ఈ పాట. ఈ పాటలో భావం, బాణీ, ఆర్కెస్ట్రాలన్నిటినీ రఫీ గానం డామినేట్ చేస్తుంది. 'ఝుకీ ఝుకీ ' అంటున్నప్పుడు వాలుకన్నులు కళ్ల ముందు నిలుస్తాయి 'నిగాహమే'లోని ని ఒత్తిపెట్టి 'గా'ని సాగదీసి పలకటం 'ఖి హై ' అంటూ 'బలాకి షోఖియా' అనటంలోని చిలిపితనం... ఒకటేమిటి, పాటలోని ప్రతి అక్షరం రఫీ పలికిన తీరు, భావాన్ని ఒలికించిన తీరు పరమాద్భుతం. రఫీ పాటలలోని గొప్పతనం ఇదే. ఈ పాట వింటున్నప్పుడు ఇక దీన్ని మించి రఫీ మరో పాట పాడలేదనిపిస్తుంది. కానీ మరో పాట వినటం ఆరంభించగానే ఆ పాటలో లీనమై సర్వం మరిచిపోతాం. అందుకే రఫీ, లత వంటివారు నాయకానాయకులను మించిన సూపర్ స్టార్లయ్యారు. ఈనాటికీ, ఎంతోమంది కొత్త గాయనీగాయకులు వస్తున్నా శ్రోతల హృదయాలలో స్థిరనివాసం ఏర్పరచుకుని ఉన్నారు. ఉంటారు.

పాట చిత్రీకరణ కూడా గొప్పగానే ఉన్నా, పాటలోని సాంద్రత, తీవ్రతలు చిత్రకరణలో పలచబడ్డాయనిపిస్తుంది. ధర్మేంద్ర అందంగా ఉన్నా గురుదత్‌లోని తీవ్రత, చిక్కదనం లోపిస్తాయి. ఈ పాటలో కెమేరా పనితనం, పాటను కథగా మలచి ప్రదర్శిస్తుంది. ఇద్దరు అమ్మాయిలున్నారు. ఒక యువకుడు. అతడు ఆ ఇద్దరిలో ఎవరో ఒకరినే ఉద్దేశించి పాడుతున్నాడు. కానీ ఆ ఇద్దరు అమ్మాయిలు ఎవరికి వారు తమ గురించి పాడుతున్నాడనే అనుకుంటున్నారు. ఆ భావాన్ని కలిగించేట్టు ప్రతి వర్ణననూ ఇద్దరికీ అన్వయించి చూపుతుంది కెమేరా. ఎడిటింగ్ పనితనం, ఇంతకీ ఈ పాట ఎవరిని ఉద్దేశించి పాడుతున్నాడో అన్న ఉద్విగ్నతను కలిగిస్తుంది. పాట ఆరంభంలో ఇద్దరు వేర్వేరుగా ఉంటారు. చివరి చరణం వచ్చేసరికి ముగ్గురూ ఒకే ఫ్రేం లోకి వస్తారు. 'ముక్కోణపు ప్రేమ కథ' అని స్పష్టమవుతుంది. ఇదంతా కెమేరా కదలికలు, ఎడిటింగ్‌లో కలిగించే భావన. పాట సాగుతూనే ఉంటుంది. అయితే చివరి చరణం వచ్చేసరికి 'తనూజ' పాత్ర పియానో దగ్గరకు వస్తుంది. నాయకుడు ఆమెని చూస్తూ పాడుతున్నాడని ప్రేక్షకులకు తెలుస్తుంది. తన గురించే పాడుతున్నాడన్న భ్రమలో 'మాలాసిన్హా' పాత్ర ఉందని అర్థమవుతుంది కానీ నాయకుడు తనూజ పాత్రను చూసి పాడుతున్నాడని ఆమె గ్రహించదు. ఆమె తనలో తాను మురుస్తూ కిటికీ దగ్గరకు వెళ్తుంది. ఇది పూర్తిగా గురుదత్ పాట చిత్రీకరణ శైలి. పాట చిత్రీకరణలో ఓ కథను ఉద్విగ్నంగా చెప్పటం గురుదత్ అలవాటు. అందుకే ఎంతో గొప్పగా ఉన్నా అసలు శిల్పి చెక్కిన శిల్పానికి, అతని ఆదేశాల ప్రకారం అంత అనుభూతి లేని మరో శిల్పి అలాగే చెక్కిన శిల్పానికీ ఉన్న తేడా ఈ పాట చిత్రీకరణ స్పష్టం చేస్తుంది. బహుశా అందుకేనేమో 'చౌధవీక చాంద్ హో' ప్రేయసి వర్ణన అనగానే ఈ పాటకన్నా ముందు గుర్తుకు వస్తుంది.

అయితే ప్రేయసి వర్ణన గేయాలలో ఒక ఉన్నత ప్రామాణికాన్ని ఉత్తమ విలువలను ప్రదర్శించిన ఈ పాట సృజించే మాధురీ ప్రవాహంలో ఓలలాడే వారికి ఇప్పటి పాటలలో ప్రేయసిని కారుతోనూ, బీరుతోనూ, ఇతర వస్తువులతో పోల్చే పాటలు వింటూంటే ఆనందం కలగదు. 'మందార మకరంద మాధుర్యమున దేలు' పద్యం గుర్తుకు వస్తుంది. అయితే ఏ తరానికి తగ్గ పాటలు, సాహిత్యం, సినిమాలు ఆ తరానికి ఉంటాయి. అందుకే ఈనాటి తరంలో 'ఆప్ కే హసీన్ రుఖ్ ' లాంటి పాటను ఎలా ఊహించలేమో 'ఏ పారిజాతమ్ములీయగలనో సఖీ' లాంటి అత్యద్భుతమైన ప్రేయసి వర్ణన గీతాన్ని కూడా ఊహించలేము. ఈ పాటలో ప్రేయసిని ప్రకృతిలో ఆరోపించి, ఆ ప్రేయసి ఆకారం ధరించి తనను కరుణించాలని కోరుకుంటున్నాడు కవి. పరమాద్భుతమైన చమత్కారం.

ఏ పారిజాతమ్ములీయగలనో సఖీ
గిరి మల్లికలు తప్ప గరికపూవులు తప్ప
ఏ కానుకలను అందించగలనో చెలీ
గుండెలోతుల దాచుకున్న వలపులు తప్ప

జగతిపై నడయాడు చంచలా వల్లికా
తరుణి ఆకృతి దాల్చు శరదిందు చంద్రికా ...
శరదిందు చంద్రికా,..,
నీవు లేని తొలి రాతిరి నిట్టూర్పుల పెను చీకటి
నీవు లేని విరి పానుపు నిప్పులు చెరిగే కుంపటి
విరులెందుకు సిరులెందుకు
మనసు లేక మరులెందుకు
తలపెందుకు తనువెందుకు
నీవు లేక నేనెందుకు ... నీవు లేక నేనెందుకు ...

కలువపూల చెంత చేరి కైమోడుపు చేతును
నా కలికి మిన్న కన్నులలో కలకలమని విరియాలని
మబ్బులతో ఒక్కమాటు మనవి చేసికొందును
నా అంగన ఫాలాంగనమున ముంగురులై కదలాలని
చుక్కలతో ఒక్కసారి చూపించి నిను
నా ప్రేయసి నల్లని వాల్జడ సందుల మల్లియనై మొలవాలని
పూర్ణ సుధాకర బింబమునకు వినతి చేతును
నా పొలతికి ముఖబింబమై కలలు దిద్దుకోవాలని
ప్రకృతి ముందు చేతులెత్తి ప్రార్థింతు కడసారిగా
నా రమణికి బదులుగా ఆకారం ధరియించాలని

అత్యద్భుతమైన కవిత ఇది. ఇంతగా ప్రేయసిని ప్రకృతిలోని పలు విభిన్నమైన అంశాలతో వర్ణించి, ప్రకృతిలోని పలు విభిన్నమైన అంశాలను ప్రేయసికి అలంకరణగా, ఆభరణాలుగా మారమని అభ్యర్థించి, చివరికి ప్రకృతిని రమణికి బదులుగా ఆకారం ధరించమని కోరుకోవటం కవి ప్రతిభను, భావనాబలాన్ని, సున్నితత్వాన్ని సూచిస్తుంది.

ఇలాంటి భావనల ఆధారంగా, ప్రేమ భావనను తీర్చి దిద్దుకున్న తరానికి స్త్రీ ఒక ఆటవస్తువుగా, అనుభవించే ద్రవ్యంలా, లైంగిక వాంఛ తీర్చుకునే మాధ్యమంలా కనబడదు. ఒక అత్యద్భుతమైన వ్యక్తిలా, ఆరాధించవలసిన అమ్మాయిగా, ప్రకృతికి ప్రతీక అయిన భగవంతుని ప్రత్యేక సృష్టిలా, తన అదృష్టంలా తోస్తుంది. కానీ స్త్రీని ఓ పీఠంపై ఉంచి పూజించి అన్యాయం చేస్తున్నారు అని నిరసించి ఆమెని బజారుకి ఈడ్చారు. ఫలితంగా ఈనాడు పసికందులు సైతం పశువాంఛలకు బలయిపోతున్నారు. మనిషి మృగమవుతున్నాడు.

ప్రస్తుతం స్త్రీ ఆటవస్తువుగా, అనుభవించగల ద్రవ్యంలా, విపణిలో వస్తువులా, అందాల బొమ్మలా, ఆనందపు గనిలా మాత్రమే పరిచయమౌతుంది. ఇలాంటి పరిస్థితులలో ప్రేమ భావనలోని ఔన్నత్యాన్ని ఉత్తమత్వాన్ని, సున్నితత్వాన్నీ, దైవత్వాన్ని నేటి తరానికి పరిచయం చేయాల్సిన ఆవశ్యకత ఉంది. ఇందుకు ఇలాంటి సినిమా పాటలు ఉపయోగపడతాయి.

*(మరికొన్ని మధురమైన ప్రేమగీతాలతో మళ్ళీ కలుద్దాం. )*

Post your comments